క్లుప్తంగా

కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్మికులు

భోగాపురం: గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు చట్టపరమైన హక్కులు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కార్మికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, కార్మికులకు రూ.26 వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. జీఓలు 57, 132, 551, 142 లను అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు డి. నర్సింగరావు, దనాల అప్పారావు, సియాదుల అప్పలరాజు, బంగారి పైడినాయుడు, కె. రాజు, ఎన్. నరసయ్యమ్మ పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని పసపాం గ్రామంలో ఓ వ్యక్తి నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్సై ఇ.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, సీఐ అప్పారావు ఆదేశాల మేరకు గ్రామంలో దాడులు చేపట్టగా వొమ్మి జోగినాయుడు వద్ద పది సీసాలు పట్టుబడినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో హెచ్‌సీ ఆర్.వసంత్, పోలినాయుడు, సిబ్బంది కె.గౌరు, బి. రాము, సీహెచ్ లోకాభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

జామి: శ్రావణ మాసం సందర్భంగా కుమరాం గ్రామంలోని ఐశ్వర్య లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు.



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

స్వామివారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి



దివ్యాంగ చిన్నారికి చేస్తున్న ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 వెంకటరావు

గంట్యాడ: భవిత కేంద్రాల ద్వారాదివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పిల్లలు వినియోగించుకునేలా తల్లి దండ్రులు చూడాలని ఎంఈఓ-2 ఎస్.వెంకటరావు సూచించారు. మండలంలోని కొర్లాం గ్రామ భవిత సెంటర్‌లో దివ్యాంగ చిన్నారులకు గురువారం అందించిన ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసిన అనంతరం ఆయన చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు ఇళ్ల వద్ద పిల్లలతో రోజూ వ్యాయామం చేయించడం వల్ల వారిలో కొంత మేర మార్పు వస్తుందని అన్నారు. ఫిజియోథెరపిస్టు, భవిత కేంద్రం సిబ్బంది జి.బి.కామేశ్వరి, సీహెచ్.రామేష్, సీహెచ్. శ్రావ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: ప్రతీ విద్యార్థి మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం మూడో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా వన్ చైల్డ్- వన్ ప్లాంట్ కార్యక్రమాన్ని పట్టణంలోని డీవీఎల్ పాఠశాల విద్యార్థులు గురువారం నిర్వహించారు. డీవీఎల్ స్కూల్ అధినేత డాక్టర్ పి.వరలక్ష్మి, తహసీల్దార్‌తో కలిసి తహసీల్దార్, అగ్నిమాపక శాఖ కార్యాలయం, మున్సిఫ్‌కోర్టు,స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి, గాంధీపార్కు, ఆటోస్టాండ్, సాయిబాబా కోవెల, పరిసరాల్లో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ కె.రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ

- కిటకిటలాడిన దుకాణాలు
- ఆకాశన్నంటిన పండ్లు, పూల ధరలు
- గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్



బంగారు దుకాణం వద్ద కొనుగోలుదారుల సందడి



పండ్లు కొంటున్న మహిళలు





పూజా సామాగ్రి కొంటున్న భక్తులు



గాజులు కొంటున్న మహిళలు



మామిడి కొమ్మలు కొంటున్న భక్తులు

విజయనగరం టౌన్: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మార్కెట్, ప్రధాన రహదారులు వినియోగదారులతో కిటకిటలాడాయి. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం రోడ్డు, గంటస్తంభం రోడ్డు మీదుగా మూడు లాంతర్ల వరకు జనాలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు మార్కెట్‌కు చేరుకుని సరుకులు కొనుగోలు చేశారు. ప్రధాన రహదారిలో బంగారు షాపులు ఉండడంతో లక్ష్మీదేవి ప్రతిమల కోసం క్యూలు కట్టారు. మధ్యాహ్న సమయంలో వర్షం పడడంతో వ్యాపారస్తులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ధరలు పైపైకి..

లక్ష్మీదేవికి ఇష్టమైన చామంతుల ధరలు ఆకాశాన్నంటాయి. కిలో వెయ్యి రూపాయలపైనే అమ్మకాలు చేపట్టారు. సాధారణ ప్రజలు పది రూపాయలకు ఒకటి, రెండు చొప్పున కొనుగోలు చేశారు. ఒక్కో కొబ్బరికాయ 40 రూపాయలకు పైగానే పలికింది. ఇక అరటి పళ్లు డజను రూ. 150 నుంచి 200 రూపాయల వరకు పలికింది. బంగారం విషయానికి వస్తే లక్ష్మీరూపు రూ. 2500 నుంచి విక్రయించారు.

స్తంభించిన ట్రాఫిక్

వాహనాల రాకపోకలు సాగించేందుకు అనువైన మార్గం లేకపోవడంతో మార్కెట్ అంతా ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. కార్లు, టూవీలర్స్ ముందుకు కదలడానికి వీల్లేకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది.

సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం



హెల్త్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 35వ డివిజన్‌లో రూ.98 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

విజయనగరం: సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ వీటీ అగ్రహారంలో ఐదు సచివాలయాల పరిధిలో సుమారు 25 వేల మంది ప్రజలకు వైద్యం అందించేందుకు రూ.98 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. నగరానికి ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరవ్వగా.. వీటిలో ఇదివరకే రెండు కేంద్రాలు ప్రారంభమయ్యాయన్నారు. తాజాగా వీటీ అగ్రహారంలో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, స్థానిక కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌చార్జులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, పార్టీ నాయకులు మారం బాలబ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు వింత ప్రభాకర రెడ్డి, వజ్రపు సత్యగౌరి, బాలి పైడిరాజు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొండవెలగాడకు బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడకు గురువారం బస్సు సౌకర్యం కల్పించారు. ముందుగా బస్సుకు ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమమ పూజలు చేయగా...ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స పచ్చజెండా ఊపి సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలు విస్తరించడం అభినందనీయమన్నారు. కొండవెలగాడ, బూరాడపేట, పారసాం, తదితర గ్రామాల ప్రజలకు బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చనమళ్ల వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యురాలు మొయిద కళావతి, టూరిజం బోరు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నేతలు మత్స సత్యనారాయణ, దంతులూరి గిరిబాబు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఏఎస్సై తవుడు తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన తమ కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



లబ్ధిదారుతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 27వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విజయనగరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలో 27వ డివిజన్ స్టేడియంపేట కాలనీ పరిధిలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలన పట్ల ప్రజా స్పందన అనూహ్యంగా వస్తోందన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో పథకాలు అందడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోందని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక శ్రద్ధతో నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ మాట్లాడుతూ, మాటతప్పని మడమతిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికీ పథకాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కొండవెలగాడలో నూతన సచివాలయ భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ, చంద్రంపేట, చిన బూరాడపేట గ్రామాల్లో రూ.1.20 కోట్లతో నూతన సచివాలయాలు, రూ.43.60 లక్షలతో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రాలు, పారసాంలో కమ్యూనిటీ స్టేజీ, పెద బూరాడపేటలో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబుతో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను చేరువ చేశామన్నారు. సంక్షేమం , అభివృద్ధి రెండు కళ్లుగా చూస్తూ అర్హతే ప్రామాణికంగా సామాజిక న్యాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించడమే కాకుండా, మరోవైపు లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ పని కావాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని.. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయాల వల్ల ఉన్న ఊరిలోనే పనులన్నీ పూర్తవుతున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ జమ్ము అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సర్పంచ్‌లు కర్రోతు అప్పలకొండ, బెల్లాన అప్పయ్యమ్మ, మక్కువ తవుడమ్మ, ఎంపీటీసీ సభ్యులు సంగంరెడ్డి జగన్నాథం, మొయిద కళావతి, వాల్లే లక్ష్మి, నేతలు మత్స సత్యనారాయణ, దంతులూరి గిరిబాబు, కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, మక్కువ వెంకటరమణ, బెల్లాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- మెప్మా బజార్ ప్రారంభం



స్టాల్స్‌ను సందర్శిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. మార్కెట్‌లోని ఉత్పత్తులను కోలగట్ల పరిశీలించి, డ్వాక్రా మహిళలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ, డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన కూడలైన కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా జగనన్న మహిళామార్టులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌చార్జులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- 805 మందికి రేషన్‌కార్డుల పంపిణీ

విజయనగరం: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు అవసరమైన అన్ని పథకాలను రాష్ట్ర ప్రభుత్వం వర్తింపచేస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నూతనంగా మంజూరైన తెల్ల రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. గురువారం స్థానిక కంటోన్మెంట్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 805 మందికి రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు పొందడానికి రేషన్‌కార్డు కీలకమన్నారు. అందువల్ల అర్హత ఉండి రేషన్ కార్డు పొందలేని వారికి వారి వివరాలను ప్రత్యేకంగా సేకరించి కార్డులు మంజూరు చేశామన్నారు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న విషయాన్ని గమనించాలని తెలిపారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్

బొండపల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టిన పనులపై పారదర్శకంగా సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఎంపీపీ చల్లా చలం నాయుడు ఆడిట్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, డీఆర్పీలు, ఎస్సార్పీలతో ఆడిట్‌పై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు క్షేత్రస్థాయిలో చేసిన పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్పీలు, ఎస్సార్పీలు పరిశీలించాలని సూచించారు. వేతనదారులతో మాట్లాడి వేతనాలు అందాయా లేదా అనే విషయాన్ని ఆరా తీయాలని చెప్పారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఏపీఓ బి.కృష్ణవేణి, ఎస్సార్పీ ఎస్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

చీపురుపల్లి: పట్టణంలోని ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సీఎంఎస్ స్కిల్ సెంటర్ మేనేజర్ ఆర్.విజయ్, కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో చదువుకున్న వారు ఈ మేళాకు రావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.